క్లుప్తంగా

ప్రణవ పీఠంలో సేవా కార్యక్రమం



ప్రణవ పీఠాన్ని శుభ్రం చేస్తున్న పీఠం సభ్యులు

ఏలూరు (అర్ఆర్‌పేట): స్థానిక బావిశెట్టి వారి వీధిలోని ప్రణవ పీఠంలో మంగళవారం ఆ పీఠం సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం సభ్యులు మాట్లాడుతూ సనాతన హైందవ ధర్మాన్ని కాపాడుకునే దిశగా ప్రతి ఆదివారం ఒక ఆలయాన్ని ఎంచుకుని పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రణవ పీఠంలో సైతం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణవ పీఠం సభ్యులు ప్రసాద్, వంశీ, ఓంకార్, మనోజ్, కోటేశ్వరరావు, గిరి, రాఘవరావు పాల్గొన్నారు.

నేడు ఏపీ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏలూరు పవరుపేటలోని అన్నే భవన్‌లో ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా విస్తృత సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహ, కె.శ్రీనివాస్ తెలియజేసారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధానోపాధ్యాయులతో సమావేశం

భీమడోలు: బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని భీమడోలు ఎంఈవో డి.సాంబశివరావు అన్నారు. భీమడోలు మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. బడిబాట కార్యక్రమం, డ్రాపవుట్స్ లేకుండా చూడడం, నాడు నేడు పనులు, బాలకార్మికులు నిర్మూలన, చదవడం మాకిష్టం తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు తోట పుష్పావతి, ఎస్‌బీటీ సుందరి, జి.కనకసునీత తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

గణపవరం: మండలంలోని మల్లపరాజుపేట కూడలివద్ద రహస్య ప్రదేశంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో మంగళవారం గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు ఆకస్మిక దాడిచేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతనివద్దనుంచి 26 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై తెలిపారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు: అప్పనవీడులో అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంత్యుత్సవాలను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం ప్రారంభించారు. అనంతరం గుడి వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కళా వేదికను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ముందుగా హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామికి ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీప్రసాదరావు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, రైతు విభాగం మాజీ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, జెడ్పీ వైస్ చైర్మన్ విజయబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి



చొదిమెళ్ల పరిసరాల్లో ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న రైతులు



మల్కాపురంలో లారీల్లో ధాన్యం ఎక్కిస్తున్న దృశ్యం

- 199 మందికి రూ. 4.48 కోట్ల ధాన్యం నగదు చెల్లింపునకు ఏర్పాట్లు
- 2,456 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- మరో 2 వేల మెట్రిక్ టన్నుల సేకరణకు సిఫార్సు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం వ్యవసాయశాఖ అధికారులు ధాన్యం సేకరణ పూర్తి చేసారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 2,456 మెట్రిక్ టన్నులు ధాన్యం రైతుల నుంచి సేకరించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.4.48 కోట్లు ధాన్యం డబ్బు చెల్లించేందుకు సిద్ధమవుతోంది. మరో పక్క మరింత ధాన్యం సేకరణకు అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న ధాన్యం సేకరించి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల సత్ఫలితాలు ఇచ్చాయి. ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు 3 వేల గోనె సంచులు అందించారు. తడిసిన ధాన్యాన్ని గుర్తించి రైతులతో చర్చించారు. ట్రాక్టర్లు, లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. తేమ శాతం పేరుతో రైతులను వేధించవద్దంటూ మిల్లర్లకు అధికారులు సూచించారు.

199 మందికి రూ.4.48 కోట్ల ధాన్యం నగదు

మరోపక్క ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వం నగదు అందించేందుకు కసరత్తు చేస్తోంది. మండలంలో 199 మంది రైతులు 2,456 మెట్రిక్ టన్నులు ధాన్యం అమ్మిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం రైతులు రూ. 4,48,85,712 నగదు అందుకోనున్నారు. ఇప్పటికే ఏపీ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ప్రభుత్వం 95 (ఎఫ్‌టీఓ) రూ.1,40,25,000 రైతుల ఖాతాలో వేసేందుకు సిద్ధమయ్యింది. 185 ఎఫ్‌టీఓ కల్గిన రైతులకు రూ.2,35,95,000 అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. మిగిలిన 22 ఎఫ్‌టీఓ గల రైతులకు రూ.25,36,400 డీఎం వద్ద ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. మొత్తంగా నిర్దేశించిన సమయానికి ధాన్యం డబ్బు రైతుల ఖాతాల్లో వేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

మరో 2 వేల మెట్రిక్ టన్నుల సేకరణ

ఏలూరు మండలంలో మల్కాపురం, చొదిమెళ్ల, వెంకటాపురం, తంగెళ్లమూడి, శనివారపుపేట, సత్రంపాడు గ్రామాల పరిధిలో 1,207 ఎకరాల్లో రైతులు వరి సాగు చేసారు. మొత్తంగా 4,330 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని అధికారులు ముందుగానే అంచనా వేసారు. కేంద్రం ఇచ్చిన టార్గెట్ పూర్తి చేసిన అధికారులు, ఇంకా మిగిలి ఉన్న సుమారు 2 వేల మెట్రిక్ టన్నులు సైతం సేకరించేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

ప్రభుత్వం ధాన్యం డబ్బు చెల్లిస్తోంది



మండలంలో ధాన్యం అమ్మిన రైతుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసాం. మొత్తంగా 199 మంది రైతులకు రూ. 4,48,85,712 అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే కొంత మంది రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు జమ అవుతోంది. మరో పక్క అదనంగా ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌కు నివేదిక అందించాం.

– ఎ. జీవనసంధ్య, ఎంఏఓ

పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగనన్న



జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ, అధికారులు

ఏలూరు రూరల్: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారదర్శక పాలనకు నిదర్శనమని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రారంభించిన జగనన్నకు చెబుదాం లాంచింగ్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పాలనపై ప్రతి పౌరుడు 1902 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు అందించేలా నిర్ణయించడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తి తన సమస్యలను నేరుగా ముఖ్యమంత్రికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం దక్కిందన్నారు. దీనివల్ల ప్రజల సమస్యలు పరిష్కరించడంపై అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరిస్తారన్నారు. మరోపక్క ప్రజలకు ప్రభుత్వం పట్ల నమ్మకం పెరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. దీనివల్ల పల్లెలు, పట్టణాలు, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలు తమ సమస్యలను ఒక్క ఫోన్‌కాల్‌తో ముఖ్యమంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. సీఎం కార్యక్రమాన్ని వీక్షించిన వారిలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి, సూపరింటెండెంట్ వై సుజాత, మండల ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

రాణాప్రతాప్ పోరాటం స్ఫూర్తిదాయకం

ఏలూరు (టూటౌన్): రాజపుత్ర వీరుడు రాణా ప్రతాప్ జయంతిని ఆత్మగౌరవ పోరాట దినోత్సవంగా ప్రభుత్వం జరపాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు కోరారు. స్థానిక అశోక్ నగర్‌లో రాణా ప్రతాప్ 484వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాజపుత్ర శౌర్య ప్రతాపాలను, పోరాటాన్ని, ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పి ఛత్రపతి శివాజీ వంటి ఎందరో దేశభక్తులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియా డారు. రాణా ప్రతాప్‌ను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. మొఘల్ చక్రవర్తి అక్బర్ సైన్యానికి, రాణాప్రతాప్ రాజపుత్ర సైన్యా నికి మధ్య హల్దీఘాట్ వద్ద జరిగిన యుద్ధం ప్రపంచ పోరాటాల్లో విశిష్టమైన స్థానాన్ని దక్కించుకుందని అన్నారు. రాజపుత్ర వంశానికి చెందిన బంజారాల జన్మ స్థలం రాజస్థాన్ అని సంచార జీవనం కలిగిన వారు నేడు దేశ మంతటా విస్తరించారని తెలిపారు. బాణావతు మోహనరావు నాయక్, సాహితీవేత్త నాగాస్త, బి.రమేష్ నాయక్ జరపల కృష్ణ ప్రసాద్, బి.బాలాజీ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి

ఏలూరు (టూటౌన్): దేశానికి పతకాలు సాధిస్తున్న మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక పవరుపేటలోని ఐద్వా జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య యామిని, ఐద్వా నాయకురాలు డి.వరలక్ష్మి, జనసేన వీర మహిళ నాయకురాలు వాణి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులు పెరిగాయని అన్నారు. దేశ గౌరవాన్ని ప్రపంచంలో నిలబెడుతున్న మహిళా క్రీడాకారుల పట్ల కూడా బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ వంటి వారు లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. దీనిపై గత 15 రోజులుగా ఢిల్లీలో క్రీడాకారులంతా ఆందోళన చేస్తుంటే దేశ ప్రధాని నరేంద్ర మోదీకి చీమ కుట్టినట్లయినా లేదని విమర్శించారు. దీన్ని బట్టి ప్రధాని మోదీకి మహిళపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా వెంటనే మహిళా క్రీడాకారిణులపై లైంగింక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసి క్రీడాకారిణులకు న్యాయం చేయాలని కోరారు. మహిళా సమాఖ్య నాయకులు లక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు తేజశ్రీ, ఎస్‌కే నగీన, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రోటరీ సేవలు మరింత విస్తృతం



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ జిల్లా గవర్నర్ భాస్కర్ రామ్ విశ్వనాథం

ఏలూరు (అర్ఆర్‌పేట): రోటరీ క్లబ్ ద్వారా సామాజిక బాధ్యతగా సమాజంలోని పేదలకు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని రోటరీ 3020 జిల్లా గవర్నర్ ఏకేఎస్ భాస్కర్ రామ్ విశ్వనాథం స్పష్టం చేశారు. రోటరీ క్లబ్ ఏలూరు అధికారిక పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక వీటీఆర్ కృష్ణా రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రూ.1.50 లక్షలతో నిర్మించనున్న సైకిల్ షెడ్డుకు శంఖుస్థాపన చేశామన్నారు. రోటరీ క్లబ్ 1975వ సంవత్సరం నుంచి ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనకు కృషి చేస్తోందని దీని నిమిత్తం ఇప్పటి వరకూ రూ. 40 వేల కోట్ల నిధులను వెచ్చించినట్లు తెలిపారు. దేశంలో పోలియో నిర్మూలనకు నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు వేస్తున్న ప్రతి పోలియో చుక్కా రోటరీ క్లబ్ సరఫరా చేస్తున్నదేనన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు జెన్నిఫర్ జోన్స్ ఆదేశాల మేరకు ఈ ఏడాదిని మహిళా సాధికారత సంవత్సరంగా పాటిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మహిళాభివృద్ధి కోసం రోటరీ క్లబ్‌ల ద్వారా విశేష సేవలందిస్తున్నామన్నారు. గత డిసెంబర్‌లో విశాఖపట్నంలో వారం రోజుల పాటు నిర్వహించిన ఆపరేషన్ ఇమాజినేషన్ కార్యక్రమంలో 1500 మంది బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశామని, 1,200 మంది పేద మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కుట్టు మిషిన్లు పంపిణీ చేయడంతోపాటు వారికి కుట్టులో శిక్షణ ఇప్పించామన్నారు. వీరితో పాటు 1,500 మంది వికలాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఏలూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చెన్నా నాగభూషణ రావు మాట్లాడుతూ గతేడాది జూలై నెలలో వికలాంగులకు ఆర్టిఫీషియల్ లెగ్స్ అమర్చే కార్యక్రమం నిర్వహించామన్నారు. తమ క్లబ్ ద్వారా అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించామని, ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో 30 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. 10 మంది పేద మహిళలకు కుట్టు మెషిన్లు, 20 మంది విద్యార్థినులకు సైకిళ్లు అందజేశామన్నారు. జూన్‌లో వివిధ పాఠశాలల్లో నేత్ర, దంత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ఏలూరు రోటరీ క్లబ్ కార్యదర్శి వంకదారు శిరీష, అజిజ్టెంట్ జిల్లా గవర్నర్ కే. కృష్ణయ్య, మాజీ జిల్లా గవర్నర్ కే. దామోదర రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన గరిమెళ్ల దుర్గానారాయణరావు మంగళవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేయగా, దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

సింధు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అమూల్యం



మహిళలకు కుట్టు మెషిన్లు పంపిణీ చేస్తున్న అతిథులు

ఏలూరు (అర్ఆర్‌పేట): నగరానికి చెందిన సింధు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలు అమూల్యమైనవని అస్సెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ ఓఎంఎస్ అధ్యక్షురాలు అనుదా నారాయణ్ అన్నారు. మంగళవారం స్థానిక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింధు చారిటబుల్ ట్రస్ట్, ఓఎన్‌జీసీ రాజమండ్రి సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 45 రోజుల పాటు తాడేపల్లిగూడెంలో ఉచితంగా కుట్టు శిక్షణ అందించడమే కాక 30 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టు మెషిన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షురాలు గనివేడ సింధూర మాట్లాడుతూ త్వరలో తమ సంస్థ ద్వారా రాజమండ్రిలో పేద మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ. జగన్నాథరావు, పీ.మాధవీ మౌళి, ఓఎన్‌జీసీ సిబ్బంది బీ. వెంకటేశ్వర రావు, పీ.సత్తిబాబు, జేవీవీ ప్రసాద్, వై. సురేష, ఎస్. మధు పాల్గొన్నారు.

అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై హర్షం



సజ్జల రామకృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

ఏలూరు (టూటౌన్): అమరావతి ప్రాంతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మంగళవారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జలను కలిసి అభినందనలు తెలియజేసినట్లు బహుజన పరిరక్షణ సమితి నాయకులు పెరికె వరప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన ఏలూరులో వెల్లడించారు. ఈనెల 17న అమరావతిలో 54 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాలు కేటాయించడంపై బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేసారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తూ త్వరలో అమరావతి ప్రాంతంలో భారీ బహిరంగ సభను నిర్వహించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేయనున్నట్లు ఆయన చెప్పారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బేతపూడి రాజేంద్ర, ఇందుపల్లి సుభాషిణి, ఈపూరి ఆదాం, నూతక్కి జ్యోషి, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరానికి చిన్నారులు

ఏలూరు (అర్ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి నగరంలోని పలువురు బాలలు ఉత్సాహంగా హాజరౌతున్నారు. మంగళవారం రెండో రోజున ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ శిబిరంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో నీతి కథలు, పంచతంత్ర కథల పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా నీతి కథలను వివరించారు. అనంతరం సీనియర్ గణిత ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ విద్యార్థులకు సంఖ్యా గణితం సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు. ఉదయం 10.30 గంటలకు విద్యార్థులకు క్రాఫ్ట్, బొమ్మల తయారీలో డీ. శ్రీవల్లి శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఏ. నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, బాల వికాస ట్రైనర్ రామడుగు విజయకుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

భీమడోలు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం శాఖా గ్రంథాలయాల్లో శిక్షణ తరగతులు ఉత్సాహంగా నిర్వహించారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణిలు ఆధ్వర్యంలో, యోగా టీచర్ కురెళ్ల కిషోర్ గేదెల ఈశ్వరీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు.

గణపవరం: మండలంలోని పిప్పర శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కాకరశ్యాం పరిశీలించారు. గ్రంథపాలకుడు పి.రంగారావు పాల్గొన్నారు.

గోనె సంచులు ఇవ్వాలి

ఏలూరు రూరల్: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచి, రైతులకు గోనె సంచులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ డిమాండ్ చేసారు. మంగళవారం మాల్కాపురం వద్ద కల్లాల్లో ధాన్యం వద్ద సంఘం సభ్యులతో కలిసి రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మల్కాపురం ఆర్‌బీకే కేంద్రం పరిధిలో మరో 1000 మెట్రిక్ టన్నులు ధాన్యం ఉందన్నారు. ప్రభుత్వం కొనుగోలు లక్ష్యాన్ని పెంచి, రైతుల వద్ద మిగిలిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. అవసరమైన గోనె సంచులు ఇవ్వాలని డిమాండ్ చేసారు.

వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు

ఏలూరు(మెట్రో): వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసేందుకు ఏబీసీ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో విచ్చలవిడిగా వీధి కుక్కలు సంచారం ఉన్నందున, వాటి వల్ల చిన్న పిల్లలకు, ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అత్యవసరంగా వీధి కుక్కలను పట్టి, వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు ఈనెల గత ఏడాది డిసెంబర్ 13న ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ తీర్మానించిందన్నారు. ఆ మేరకు వీధికుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసేందుకు యానిమల్ హౌజ్ బెండరీ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసేందుకు ఏబీసీ సెంటర్‌ను ప్రారంభినట్లు చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	--
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	27
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	19

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	13
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

శాశ్వత భూ హక్కుపై అవగాహన

భీమడోలు: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం అద్భుత కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షంషూద్దీన్ అన్నారు. గుండుగొలను పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకంపై రైతులు, గ్రామస్తులకు అవగాహన సదస్సును నిర్వహించారు. భూముల రీసర్వేపై ప్రజల వచ్చిన అనుమానాలను వారు నివృత్తి చేశారు. ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరైన తహసిల్దార్ షంషూద్దీన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భూములు రీసర్వే చేసిన దాఖలాలే లేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత భూ హక్కు భూరక్ష పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకంలో భూములను రీసర్వే చేస్తే భూ వివాదాలకు చెక్ పడుతుందన్నారు. పొలం కలిగిన వారంతా తమ ఆధారకార్డులు, డాక్యుమెంట్లను రెవెన్యూ, సర్వేయర్ సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రజలు సహకరించినట్లయితే సర్వే వేగవంతమవుతుందన్నారు. ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి వారికి వారికి శాశ్వత భూ హక్కు పత్రాలను అందిస్తుందని అన్నారు. సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణకుమారి, వార్డు సభ్యులు, వీఆర్వోలు కందులపాటి శంకర్, వి.వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ కార్యక్రమంపై హర్షం

ఏలూరు (టూటౌన్): మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ ఏలూరు నగరంలో ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ డి.మేరీ ప్రశాంతికి కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యుడు పులి శ్రీరాములు అభినందనలు తెలియజేసారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తన హర్షాన్ని వెలిబుచ్చారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకూ దూర ప్రాంతం నుంచి ఏలూరు వచ్చి రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడే మహిళలు 100/112 లేదా 83329 59175కు ఫోన్ చేస్తే వాహనంతో మహిళా కానిస్టేబుల్ వచ్చి గమ్యస్థానానికి చేర్చటం మంచి కార్యక్రమన్నారు. ఏలూరు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాత్రిపూట పెట్రోలింగ్‌ను పర్యవేక్షించడం సిబ్బందికి తగు సూచనలు చేయటం, స్పందన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించటం, విధి నిర్వహణలో మేరీ ప్రశాంతి చూపుతున్న అంకిత భావానికి నిదర్శనంగా నిలుస్తుందని పులి శ్రీరాములు ప్రశంసించారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ ప్రాంతంలో జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని ఏలూరు టూటౌన్ ఎస్సై కే.ప్రసాద్ తెలిపారు. ఏలూరు అమీనాపేట మీసేవా కేంద్రం సమీపంలోని బహిరంగ ప్రదేశంలో ముగ్గురు వ్యక్తులు కోత బంతి అనే పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్సై మంగళవారం తెలిపారు. వారివద్ద నుంచి రూ.3,010 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.